సాక్షి ఒడిశా

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,42,151లు, బంగారం 2 గ్రాముల 590 మిల్లీగ్రాములు వెండి 150 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రోడ్ల మరమ్మతులు చేపట్టండి

ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కూనేరు నుంచి పార్వతీపురం వరకు ఉన్నటువంటి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ట్రక్ యజమానుల కోరారు.

- 8లో

కత్తితో దాడిచేసిన వ్యక్తి అరెస్టు



ఇద్దరి వ్యక్తులపై కత్తితో దాడిచేసి, హత్య చేసేందుకు ప్రయత్నించాడనే నేరారోపణపై జయపురం సమితి తొలి అంబాగుడ గ్రామానికి చెందిన హరి భొరజను అరెస్టు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

చారిత్రాత్మక గుహల సందర్శన



గుహలను పరిశీలిస్తున్న గవర్నర్ రఘుబర దాస్

భువనేశ్వర్: నగర శివారులోని చారిత్రాత్మక ఖండగిరి, ఉదయగిరి గుహలను రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ మంగళవారం సందర్శించారు. ఖారవేళుని కాలంలోని శాసనాలు, విశాలమైన శిల్పాలను పరిశీలించారు. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సీనియర్ సిబ్బంది ఈ గుహల చారిత్రాత్మక వివరాలను గవర్నర్‌కు వివరించారు. ఈ గుహలు ధార్మిక, చారిత్రాత్మక ప్రాధాన్యతకు ఆనవాళ్లుగా పేర్కొన్నారు.

సువర్ణ రేఖకు వరద నీరు



వరద నీటితో నిండికుండలా ఉన్న జలకా నది

భువనేశ్వర్: సువర్ణ రేఖ నదికి వరద పోటెత్తుతోంది. రాజ్ ఘాట్ వద్ద గరిష్ట నీటిమట్టం 9.45 మీటర్లు కాగా 10.20 మీటర్ల నీటి మట్టంతో ఉప్పొంగుతోంది. ఈ పరిస్థితుల్లో వరదలు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిక జారీ చేశారు. మరోవైపు జలకా నది నీటి మట్టం సైతం గణనీయంగా పెరుగుతోంది. బొస్తా ప్రాంతం మథాని వద్ద జలకా నది నీటి మట్టం ప్రమాద సంకేతం దాటి ఉప్పొంగుతోంది. సాధారణ నీటిమట్టం 6.50 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 6.83 మీటర్లు ఉంది.

ఉప్పొంగుతున్న వైతరణి



ఉప్పొంగి ప్రవహిస్తున్న వైతరణి నది

భువనేశ్వర్: వరద నీటితో వైతరణి నది ఉప్పొంగుతోంది. భద్రక్ జిల్లా అఖువాపాడా ప్రాంతంలో ప్రమాద సంకేతం దాటి వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. వైతరణి నది గరిష్ట నీటిమట్టం 17.83 మీటర్లు కాగా, వరద నీరు చేరడంతో నీటిమట్టం 18.14 మీటర్లకు చేరింది.

మత్తిలిలో వైద్య బృందం పర్యటన



కోలాబ్ నది దాటుతున్న వైద్య బృందం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి పరిధి తులసీ పాహడ్, కర్తాన్‌పల్లి, అట్టల్‌గూడ, బారా గ్రామాల్లో అతిసారం వలన ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయా గ్రామాల్లో జిల్లా వైద్యాధికారి ధనేశ్వర్ మహాపాత్రో ఆదేశాల మేరకు ఒక వైద్య బృందం కోలాబ్ నదిని దాటుకుంటూ అతికష్టం మీద పర్యటించింది. దీనిలో భాగంగా స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిస్థితి చేయిదాటిన వారిని మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తాజా ఆహార పదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచిస్తున్నారు.

రూ.73,500లకు లడ్డూ వేలంపాట



లడ్డూను ఊరేగిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక బగాతి వీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గణపతి లడ్డూను వేలం వేయగా రూ.73, 500లు పలికింది. గత 12 ఏళ్లుగా బగాతి వీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నట్టు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రంలో... 'సుభద్ర' శకం..!



ప్రజలకు అభివాదం చేస్తున్న పీఎం నరేంద్రమోదీ



సుభద్ర యోజన ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ప్రజానీకం



పీఎంఏవై ఇంటి తాళం చెవి అందజేస్తున్న పీఎం మోదీ

- పథకాన్ని ప్రారంభించిన పీఎం మోదీ
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని వెల్లడి
- పథకంతో మహిళలకు మేలు జరుగుతుందని వెల్లడి

భువనేశ్వర్:

రాష్ట్రంలో సుభద్ర యోజన శకం ప్రారంభమైంది. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సుభద్ర యోజన పథకాన్ని స్థానిక జనతా మైదాన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగం జై జగన్నాథ్ నినాదంతో ఆరంభించారు. జగన్నాథ స్వామి ఆశీర్వాదంతో రాష్ట్రానికి మరోసారి రావడం సాధ్యమైందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం తమ సర్కారుకు మాత్రమే సాధ్యమవుతోందని గర్వంగా ప్రకటించారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆధ్వర్యంలో కొత్త బృందం చురుకుగా పని చేస్తోందని కితాబిచ్చారు.

శ్రీమందిరం ద్వారాలు తెరిచాం

తమ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలుత శ్రీమందిరం నాలుగు ద్వారాలను తెరిచి భక్తులకు దర్శనం సౌకర్యవంతం చేయగలిగిందని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా తెరుచుకోని శ్రీజగన్నాథుని రత్న భాండాగారం తెరిచి, అనుబంధ కార్యకలాపాలను నిరవధికంగా చేపడుతున్నట్లు చెప్పారు. తాజాగా మహిళా సాధికారితకు సంకల్పించి సుభద్ర యోజనని ప్రారంభించడం గర్వ కారణంగా పేర్కొన్నారు. ఈ పథకంతో 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల అర్హులైన మహిళలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇప్పటికే 76 లక్షల మంది మహిళలు సుభద్ర పథకం కోసం వివరాలు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ పథకం కింద రూ.50,000 చొప్పున లబ్ధిదారుల ఖాతాలకు నగదు ప్రత్యక్షంగా బదిలీ చేస్తారన్నారు. 5 సంవత్సరాలకు ఏటా రెండు విడతల్లో రూ.5 వేలు చొప్పున జమ చేయనున్నట్లు తెలిపారు.

రైల్వే ప్రాజెక్టులకు ఆవిష్కరణ

ఈ సందర్భంగా రాష్ట్రంలో రూ.3,800 కోట్ల విలువైన రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధానమంత్రి ఆవిష్కరించారు. వీటిలో రూ.2,871 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు, రూ.1,000 కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 20 మంది లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించారు. అనంతరం స్థానిక గడాకొణ సవర వీధిని ప్రత్యక్షంగా సందర్శించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో 30 లక్షల మందికి పైబడి ప్రజలకు పక్కా ఇల్లు కల్పించిందని ప్రధానమంత్రి ప్రసంగంలో పేర్కొన్నారు. వీరిలో 26 లక్షల మంది వరకు గ్రామీణ ప్రజలు ఉన్నారన్నారు. మిగిలిన వారంతా పట్టణ, నగర వాసులుగా ఆయన పేర్కొన్నారు. 25 వేల గ్రామాలకు పక్కా రహదారుల నిర్మాణం పూర్తి చేశామన్నారు.

నిధుల కేటాయింపులు రెండింతలు

దళిత వర్గాల వికాసం కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపు రెండింతలు పెంచినట్లు పేర్కొన్నారు. దేశంలో 60 వేల దళిత ప్రభావిత గ్రామాలను వికసింపజేయడమే లక్ష్యమని వివరించారు. దేశ పురోగతిలో యువత పాత్ర కీలకమని ప్రోత్సహించారు. యువతరం కోసం ప్రత్యేక ప్యాకేజీ రూపొందించినట్లు తెలిపారు. రూ.2 లక్షల కోట్ల పరిమాణంతో యువత కోసం ప్రత్యేక ప్యాకేజీ సిద్ధం చేశామన్నారు. దీని నుంచి ఒడిశా యువత కూడా లబ్ధి పొందుతుందని వెల్లడించారు.

మల్కన్‌గిరిలో...



మట్లాడుతూన్న మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి

జిల్లా కేంద్రంలోని మల్కన్‌గిరి సమితి మైదానంలో సుభద్ర యోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి ప్రారంభించారు. తొలి విడతగా 15వ తేదీలోగా దరఖాస్తులు అందజేసిన వారికి ఖాతాల్లో నిధులు జమ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టాంగులు, కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్, పంచాయతీ కౌశల్ చైర్‌పర్సన్ గౌరీ పోడియామి, మలకన్‌గిరి మున్సిపల్ చైర్మన్ మనోజ్ బారిక్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కవిత మోహంతి, మల్కన్‌గిరి సమితి అధికారి ప్రభాతి జోడియా, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో...



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు

పట్టణంలోని గజపతి స్టేడియంలో సుభద్ర యోజన కార్యక్రమం కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుభద్ర పథకంపై లబ్ధిదారులకు వివరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 1401 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అన్ని గ్రామాల్లో అక్టోబర్ 2 వరకు స్వచ్ఛ భారత్ నిర్వహించాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, గౌరవ అతిథులుగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్య నిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, సబ్ కలెక్టర్ అనూప్ పండా, పురపాలక కార్యనిర్వహణ అధికారి గౌరచంద్ర పట్నాయక్, గుసాని బీడీవో అజయ్ కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో...



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో సుభద్ర యోజన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి మీనాక్షి దాస్ తదితరులు సుభద్ర పథకం గురించి లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా 32 మందికి ఆవాస్ గృహాల నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలను అందించారు.

జయపురంలో...



సుభద్ర యోజన సభలో పాల్గొన్న మహిళలు

స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయ క్రీడా మైదానంలో సుభద్ర యోజన ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్యా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, జయపురం సమితి అధ్యక్షురాలు తిలోత్తమ ముదులి, ఉపాధ్యక్షుడు గణేష్ పాఢి, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, బీడీవో శక్తి మహంతి తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా పతాకం కలకలం



సోషల్ మీడియాలో దుమారం రేపిన పాలస్తీనా జెండా

- పలుచోట్ల ఎగురవేసినట్లు సోషల్ మీడియాలో వైరల్

భువనేశ్వర్: రాష్ట్రంలోని కొన్నిచోట్ల పాలస్తీనా జెండా ఎగురవేయడం చర్చనీయాంశంగా మారింది. మతపరమైన ఊరేగింపు సందర్భంగా కటక్, కేంద్రాపడా ప్రాంతాల్లో ఈ కలకలం రేగింది. కేంద్రాపడా నగరం పాత బస్టాండ్ పోలీసు ఔట్ పోస్ట్ సమీపంలో కొంతమంది యువకులు జెండా పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా చర్చనీయాంశం అయింది. అలాగే కటక్ నగరంలో పలుచోట్ల చేపట్టిన ఊరేగింపుల్లో పాలస్తీనా పతాకంతో ఫ్రీ పాలస్తీనా, ప్రే ఫర్ పాలస్తీనా నినాదాల ప్లకార్డులతో పలువురు యువకులు పాల్గొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. అయితే పాలస్తీనా జాతీయ జెండా స్థానిక మతపరమైన ఊరేగింపు కార్యక్రమంలో ఎగురవేయడం వెనుక కారణం తెలియడం లేదు.

ఎటువంటి ఘటనలు జరగలేదు

కేంద్రాపడా ప్రాంతంలో జాస్నే ఈద్ మిలాదున్ నబీ కమిటీ ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ ఊరేగింపులో ఇలాంటి సంఘటన జరగలేదన్నారు. ఎవరైనా ఇలా చేసి ఉంటే క్షమించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ హఫీజూర్ రెహమ్మన్ మాట్లాడుతూ శాంతియుతంగా ఊరేగింపు నిర్వహించామన్నారు. పాలస్తీనా జెండా ఎగురవేయడం తాము చూడలేదని తెలిపారు. ఎవరైనా ఈ చర్యకు పాల్పడితే ఖండించాల్సిందేనని పేర్కొన్నారు. సమాచారం అందడంతో కేంద్రాపడా టౌన్ థాణా అధికారి సంఘటనా స్థలానికి పోలీసులను పంపించినట్లు టౌన్ పోలీసు అధికారి దిలీప్ సాహు తెలిపారు. కానీ జెండా ఎగురుతున్నట్లు కనిపించలేదు. దీనికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు చేయలేదని ఆయన వివరించారు. కటక్ నగరంలో కూడ ప్రోఫెట్ మహ్మద్ జయంతి పురస్కరించుకుని నిర్వహించిన ఊరేగింపులో పాలస్తీనా జాతీయ పతాకం ఎగిరినట్లు వచ్చిన సమాచారంపై కటక్ ప్రాంతంలో నాయకులు స్పందించారు. ఈ నేపథ్యంలో బరాబటి కటక్ నియోజకవర్గం శాసనసభ సభ్యురాలు సోఫియా ఫిరదౌస్ మాట్లాడుతూ కటక్ నగరం సౌభాతృత్వ భావాల విలువలు కలిగిన ప్రాంతం. ఈ ప్రాంతంలో ఇటువంటి సంఘటన విచారకరమన్నారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

అభ్యంతరం లేదు

మన దేశంలో పాలస్తీనా పతాకం ఎగుర వేయడంపై ఎటువంటి అభ్యంతరం లేదని కటక్ లోక్‌సభ సభ్యుడు భర్తృహరి మహతాబ్ వ్యాఖ్యానించారు. యునైటెడ్ నేషన్స్‌లో పాలస్తీనాకు అనుకూలంగా ఓటు వేసిన విషయం ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పాలస్తీనా మాజీ రాష్ట్రపతి యాసిర్ అరాఫత్ భారతదేశానికి మంచి మిత్రునిగా చలామణి అయ్యారన్నారు. భారత్ ఈ దేశానికి అపాయకర పరిస్థితుల్లో సముచిత సహాయ సహకారాలు అందజేస్తోందని పేర్కొన్నారు.

భయం గుప్పెట్లో లంబేరి

- గ్రామంలో విజృంభిస్తున్న డయేరియా
- వారం రోజుల్లో నలుగురు మృతి
- అప్రమత్తమైన వైద్య శాఖ



లంబేరి గ్రామం



జాగ్రత్త చర్యలు వివరిస్తున్న ఆరోగ్య కార్యకర్త



గ్రామస్తులు తాగేందుకు వినియోగిస్తున్న నీరు

రాయగడ: జిల్లాలో కల్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీలోని లంబేరి గ్రామంలో డయేరియా విజృంభిస్తోంది. ఈ గ్రామంలో 120 కటుంబాలకు చెందిన 500 మందికి పైగా ఆదివాసీలు నివసిస్తున్నారు. డయేరియా వ్యాధి సంక్రమించడంతో గత వారం రోజుల్లో ఈ గ్రామంలో నలుగురు మృతి చెందారు. వారిలో సదాయి నచిక(45), రాలిక అసిడియా(40), కుముట నచిక(40), లలి బలక(38)లు ఉన్నారు. కాగా వ్యాధితో బాధపడుతున్నవారు ఇప్పటికీ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేసుకునే దాఖలాలు కనిపించడం లేదు. వారి అమాయకత్వం, వ్యాధి నయమవుతుందనే అపోహలతో పూజలు, నాటువైద్యంపైనే ఆధారపడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రాణం మీదకు రావడంతో కొంతమందిని ఆటోలో సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వైద్య శాఖ అప్రమత్తమై సోమ, మంగళవారాల్లో గ్రామానికి వైద్య బృందాలను తరలించింది. దీంతో అక్కడికి చేరుకున్న వైద్య బృందం ఇంటింటా వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యింది. అనారోగ్యానికి గురైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు వ్యాధి నివారణ మందులను అందజేస్తున్నారు.

దహన సంస్కారాలకు దూరం

ఆ గ్రామంలో గత వారం రోజుల్లో నలుగురు మృతి చెందడంతో భయాందోళనలకు గురైన వారి బంధువులు దహన సంస్కారాలకు కూడా హాజరవ్వడం లేదు. అంత్యక్రియల్లో పాల్గొంటే తమకు కూడా వ్యాధి సంక్రమిస్తుందనే అపోహలతో కార్యక్రమాలకు దూరమవుతున్నారు. బంధువులు హాజరవుతారని ఎదురుచూసి దహనాలు నిలిపివేస్తున్నారు. రోజుల తరబడి మృతదేహాలను గ్రామంలో ఉంచడంతో మరింత ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పాల్సిన దుస్థితి ఎదురవుతోంది. కాగా గ్రామానికి చేరుకున్న వైద్య బృందం ఈ మేరకు వారిని చైతన్యపరచడంలో నిమగ్నమయ్యారు.

కలుషిత నీరే కారణం..?

గ్రామంలో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణంతో పాటు కలుషితమైన నీటిని సేవించడం వలనే వ్యాధి సంక్రమిస్తోందని ప్రాథమికంగా వైద్య బృందం అంచనా వేసింది. దీనికి నివారణ చర్యలుగా కాచిన నీటిని తాగాలని ఆరోగ్య కార్యకర్తలు గ్రామస్తులకు వివరిస్తున్నారు. బుధవారం గ్రామానికి ప్రత్యేక వైద్య బృందం వ్యాధి తీవ్రత, నివారణ చర్యలతో పాటు వ్యాధికి గల కారణాలను అన్వేషించేందుకు వెళ్లనున్నట్లు సమాచారం.



వ్యాధితో మంచం పట్టిన రోగి



ఇంటింటా వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం



గ్రామస్తులకు మందుల పంపిణీ

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



సబ్ కలెక్టర్‌ను కలిసిన కార్మిక నేతలు

జయపురం: తమ సమస్యలు పరిష్కరించాలని జయపురం సేవా పేపరు మిల్లు కార్మికులు, విశ్రాంత కార్మికులు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ అక్కవరం శశ్యరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మిల్లు పూర్తి స్థాయిలో నడిచేందుకు, కార్మికులు, విశ్రాంత కార్మికులకు మిల్లు యాజమాన్యం చెల్లించాల్సిన బకాయి వేతనాలు, పీఎఫ్, గ్రాచ్యుటీ వెంటనే యాజమాన్యం చెల్లించేటట్లు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2020 ఫిబ్రవరి 26న జరిగిన బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్‌ను మిల్లు కార్మికులందరికీ వర్తింపజేసేటట్టు మిల్లు యాజమాన్యాన్ని ఆదేశించాలని కార్మిక నేత ప్రమోద్‌కుమార్ మహంతి విజ్ఞప్తి చేశారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో కార్మిక నేతలు కె.సత్యనారాయణ, నారాయణ దాస్, బసంత బెహర, ధృభ మల్లిక్, కార్తీక మల్లిక్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతా హీ సేవ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం స్వచ్ఛతా హి సేవా చైతన్య కార్యక్రమం నిర్వహిస్తోంది. మండల వ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, రైళ్లు, రైల్వే రెసిడెన్షియల్ కాలనీలు, ఉత్పత్తి యూనిట్లు మొదలైన వాటి వద్ద పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, స్వచ్ఛందంగా పరిశుభ్రత కోసం సామూహిక చర్యను బలోపేతం చేయడానికి తీసుకున్న చొరవ. ఖుర్దా రోడ్ అదనపు మండల రైల్వే అధికారి (ఆపరేషన్) పి.కె.బెహెరా అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి పరిశుభ్రతకు కట్టుబడి సాధారణ ప్రజలను పరిశుభ్రత చైతన్యపరిచేందుకు స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. డివిజన్‌లోని అన్ని ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు.

యువజన కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

రాయగడ: స్థానిక కపిలాస్ కూడలిలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధానమంత్రి మోదీ పుట్టినరోజు పురస్కరించుకొని నిరసన తెలిపారు. దేశంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేని పీఎం జన్మదినాన్ని అట్టహాసంగా జరుపుకోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్ నాయక్, ఉపాధ్యక్షుడు అశోక్ పువ్వల, కార్యకర్తలు సహీద్ జున్ హక్, సత్యా మండంగి, రాజేంద్ర పలక, సింహాద్రి పలక, బసంత దండసేన తదితరులు పాల్గొన్నారు.

అజిత్ మృతి తీరని లోటు



సామంతరాయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జయపురం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అజిత్ సామంతరాయ్ మృతి తీరని లోటని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ భవనంలో మంగళవారం నిర్వహించిన అజిత్ సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామంతరాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి, ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షి బాహిణీపతి, జయపురం మున్సిపల్ చైర్మన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నరేంద్ర కుమార్ మహంతి, పార్టీ జిల్లా కోశాధికారి నహారంజన్ బిశాయి, జిల్లా ఎస్సీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రామ నాయిక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గా ప్రసాద్ శర్మ, జయపురం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత నాయిక్, పట్టణ కార్యదర్శి గంగా సాహు, జిల్లా మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మదన్ హసాని తదితరులు పాల్గొన్నారు.

కాలువలో మృతదేహం లభ్యం



కాలువలో తేలుతున్న యువకుడి శవం

భువనేశ్వర్: పూరీ జిల్లా పిప్పిలి ప్రాంతంలోని కాలువలో గుర్తు తెలియని వ్యక్తి శవం తేలుతున్నట్టు స్థానికులు గుర్తించారు. కాలు, చేతులు కట్టేసి కాలువలో పడేసినట్టు స్పష్టమవుతోంది. పిప్పిలి ఉత్తరా ఛక్ సమీపం కాలువలో ఈ మృతదేహాన్ని వెలికితీశారు. మృత యువకుడి జేబులో మొబైల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యువకుడి గుర్తింపు అస్పష్టంగా ఉంది. ఉత్తరా ఔట్ పోస్ట్ ఠాణా పోలీసులు అసహజ మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టండి



ఎంపీకి సమస్యలు వివరిస్తున్న తెలుగు సంఘాల ప్రతినిధులు

రాయగడ: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కూనేరు నుంచి పార్వతీపురం వరకు ఉన్నటువంటి రోడ్లు అత్యంత దయనీయంగా ఉన్నాయని, చొరవ తీసుకొని రోడ్లు మెరుగుపరచాలని కోరుతూ రాయగడ ట్రక్ యజమానుల సంఘం ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడుకి మంగళవారం ఒక వినతిపత్రం సమర్పించారు. రాయగడలో ఆయన పర్యటించిన సందర్భంగా స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ట్రక్ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎల్ల కొండబాబు నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం ఆయనను కలిసి ఈ మేరకు సమస్యలకు సంబంధించిన వినతిపత్రం సమర్పించారు. నిత్యం వందలాది వాహనాలు ఒడిశా నుంచి ఆంధ్రాకు వెళ్తుంటాయని, కానీ సుమారు 25 కిలో మీటర్ల మేర రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వివరించారు. ఇదే విషయమై పొరుగు రాష్ట్రం మన్యం జిల్లా పార్వతీపురంలోని కూనేరు, కొమరాడ వంటి ప్రాంతాల్లో పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకపోయిందని వివరించారు. ఇప్పటికైనా ఆంధ్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని రోడ్లను మెరుగుపరచాలని కోరారు.



ఎంపీ అప్పలనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొండబాబు

ఎంపీ దృష్టికి ఉత్కళాంధ్రుల సమస్యలు

అదేవిధంగా రాయగడలో పర్యటించిన ఎంపీని స్థానికంగా ఉన్నటువంటి తెలుగు సంస్థలకు చెందిన ప్రతినిధుల బృందం కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ఇక్కడ చదువుతున్న తెలుగు విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారుతోందని వివరించారు. తెలుగు పాఠ్య పుస్తకాలు లభించకపోవడం ఒక సమస్య అయితే, ఉపాధ్యాయుల కొరత మరోవైపు వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా ఇప్పటికే కొన్ని తెలుగు పాఠశాలలు మూతపడగా, మరికొన్ని మూతపడే స్థితికి చేరుకున్నాయని స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థకు చెందిన గుడ్ల గౌరి, భళ్లమూడి నాగరాజు, పిల్లల శంకరరావు, కె.కృష్ణమూర్తి పట్నాయక్, బాలకృష్ణ పట్నాయక్ తదితరులు వివరించారు. అనంతరం స్థానికంగా ఉన్న పలు సంఘాలకు చెందిన ప్రతినిధులు ఎంపీ దృష్టికి వివిధ సమస్యలను తీసుకెళ్లారు.

కత్తితో దాడిచేసిన వ్యక్తి అరెస్టు



అరెస్టైన హరి పొరజ



పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తి

జయపురం: ఇద్దరి వ్యక్తులపై కత్తితో దాడిచేసి, హత్య చేసేందుకు ప్రయత్నించాడనే నేరారోపణపై జయపురం సమితి తొలి అంబాగుడ గ్రామానికి చెందిన హరి పొరజను అరెస్టు చేసినట్టు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వరచంద్ర తండి మంగళవారం తెలియజేశారు. ఇటీవల మహోళియపుట్ గ్రామానికి చెందిన మనోరంజన్ పాణిగ్రాహి తన మిల్లు నుంచి మిల్లులో పనిచేస్తున్న ఖగేశ్వర్ పొరజతో కలిసి ఒక బైక్‌పై జయపురం మార్కెట్‌కు వెళ్లారు. అక్కడ పనులు చూసుకొని తిరిగి తమ గ్రామం వెళ్తున్న సమయంలో డోలిగుడ వంతెన సమీపంలో నిందితుడు హరి పొరజ ఒక కత్తితో వారిపై దాడి చేశాడు. దీంతో భయపడి వారు పరుగులు తీశారు. ఈ ఘటనలో మనోరంజన్‌కు కత్తి దెబ్బలు తగిలాయి. వారు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

చెరువులో మునిగి రెండేళ్ల చిన్నారి మృతి



దేబేంద్ర మృతదేహం సోను మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 70 గ్రామానికి చెందిన కృష్ణ మల్ల కుమారుడు సోను మల్ల మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులో ఉన్న చెరువులో మునిగిపోయి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సోను ఇంటి ముందర ఆడుతుండడంతో తల్లి ఇరుగుపొరుగు వారితో విశ్వకర్మ పూజ వద్దకు వెళ్లింది. అనంతరం అక్కడ నుంచి ఇంటికి వచ్చి చూడగా సోను కనిపించలేదు. కొంతమంది పిల్లలు చెరువు వద్ద ఆడుతున్నారని తెలిసి, అక్కడికి వెళ్లి చూసింది కానీ అక్కడ కూడా కనిపించలేదు. దీంతో ఒక రైతు నీటిలోకి దిగి వెతకగా సోను మృతదేహం దొరికింది. దీంతో ఈ విషయంపై కలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ చంద్రకాంత్ తండి గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

నీటి గుంతలో పడి మరొకరు...

కలిమెల సమితి బోడిగేట్ట పంచాయతీలో ఏడాదిన్నర వయస్సు ఉన్న బాలుడు నీటి గుంతలో పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మున్ని ఇంట్లో వంట చేస్తున్న సమయంలో తన కుమారుడు ఇంటి బయట పిల్లలతో ఆడుతున్నాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా కుమారుడు కనిపించలేదు. అయితే ఎవరో బాబుని తీసుకెళ్లి ఆడిపిస్తుంటారు అని అనుకుంది. బాబును వెదుకుతూ అందరినీ అడిగినా ఎవరూ కనిపించలేదు అని చెప్పడంతో ఆందోళనకు గురయ్యింది. ఈ నేపథ్యంలో ఇంటికి కొంతదూరంలోని పంట పొలాలకు నీటి కోసం తీసిన గుంతను చూడగా అందులో బాలుడి మృతదేహం కనిపించింది. దీంతో వెంటనే బాలుడిని తీసి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది.

స్టీల్ ప్లేట్ పడి ఇద్దరు మృతి

భువనేశ్వర్: ఝార్సుగుడ జిల్లా బుడిపాదొరొ ప్రాంతంలో ఒరిస్సా మెటాలిక్ ప్రైవేట్ లిమిటెడ్ (ఓఎంపీఎల్) కర్మాగారంలో మంగళవారం స్టీల్ ప్లేట్ పడి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరో 5 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. గంజాంకు చెందిన 34 ఏళ్ల పూర్ణచంద్ర జెనా మరియు జార్ఖండ్‌కు చెందిన 39 ఏళ్ల అలెక్ దేవ్ సాహు మృతులుగా గుర్తించారు.

ట్రక్కు బోల్తా



ప్రమాదానికి గురైన ట్రక్కు

జయపురం: సబ్ డివిజన్‌లోని బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి కొట్ట జంక్షన్ మవుల మామందిర సమీపంలో నీలగిరి కలప తీసుకెళ్తున్న ట్రక్కు అదుపు తప్పి బోల్తా పడింది. మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే డ్రైవర్, క్లీనర్‌లు గాయపడినట్లు తెలిసింది. ఆ ట్రక్కు లమతాపుట్ నుంచి కొట్ట జంక్షన్ మీదుగా భద్రాచలం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. బొయిపరిగుడ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు జరుపుతున్నారు.



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న దృశ్యం

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ

రాయగడ: జిల్లాలోని మునిగుడలో మంగళవారం జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, ఎస్పీ హరీస్ బీసీ, ఏడీఎం భాస్కరరైతా, సమితి అధ్యక్షుడు దుఖినీ సుంద్రక తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా సమితిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి 61 సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించారు. వీటిలో 42 వ్యక్తిగత సమస్యలు కాగా, 13 గ్రామ సమస్యలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఒక రోగికి చికిత్స కోసం ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రెండు స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు రూ.7 లక్షల చెక్కు రుణం అందించారు. మరో ముగ్గురు దివ్యాంగులకు వీల్‌చైర్లను ప్రదానం చేశారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు



తేనెటీగల దాడి వలన పరుగులు తీస్తున్న జనం

రాయగడ: సుభద్ర యోజన పథకం ప్రారంభోత్సవ సభలో అపశృతి చోటుచేసుకుంది. సమావేశం జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ముగ్గురు గాయాలు పాలవ్వగా మిగతావారు సభాస్థలం నుంచి భయంతో పరుగులు తీశారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కల్యాణసింగుపూర్‌లో సుభద్ర యోజన ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సమయంలో సభాస్థలానికి సమీపంలో ఉన్న చెట్టు పైనుంచి తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో బిచిత్రా నంద సాహు, చంచాడగుడ గ్రామానికి చెందిన మునింగి కాలుగోపాల్, దులేనిగుడ గ్రామానికి చెందిన కంజకా రాజ్‌లు తీవ్రంగా గాయాలు పాలయ్యారు. మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తేనెటీగల దాడిలో గాయాలైనవారిని అగ్నిమాపక సిబ్బంది వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి చికిత్స కోసం తరలించారు. గాయాలైన వారిలో బిచిత్రనంద సాహు, మునింగకాలు గోపాల్ తదితరుల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని జిల్లా కేంద్రస్పత్రికి తరలించారు.



గాయాలు పాలైన వ్యక్తులు

పాయసం రుచి చూసిన పీఎం



పాయసం తింటున్న పీఎం మోదీ, సీఎం మోహన్

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజున మంగళవారం నగరంలో బీదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఇళ్ల తాళాలు అప్పగించారు. ఈ సందర్భంగా బీదల ఇంట గృహ ప్రవేశం చేసి దైవారాధన నిర్వహించారు. అనంతరం గడొకొణ బీదలవాడలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం లబ్ధిదారుడు అంత్యరామి నాయక్ ఇంట్లో మోదీ ఖీరీ (పాయసం) ఆరగించారు. ఆయనతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సైతం పాయసం స్వీకరించారు. అంత్యరామి కుటుంబీకులు రుచికరమైన ఖీరీ సిద్ధం చేసింది. సంప్రదాయ రీతిలో వండి సిద్ధం చేసిన ఖీరీ మాధుర్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు.

లడ్డూల పంపిణీ



ఓటీడీసీ లడ్డూల వితరణ కేంద్రం

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పుట్టిన రోజు నాడు రాష్ట్ర పర్యటనకు విచ్చేయడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఒడిశా పర్యాటక అభివృద్ధి సంస్థ(ఓటీడీసీ) లడ్డూలు పంచిబెట్టింది.

స్థానిక విమానాశ్రయం నుంచి గొడొకొణ వరకు 10 వేర్వేరు చోట్ల లడ్డూ వితరణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ మార్గంలో వెళ్లేవారికి లడ్డూలు అందజేశారు.

సత్తాచాటిన రాష్ట్ర యువకులు



అమరేష్ కుమార్ సాహు



అఖిల్ గేదెల

భువనేశ్వర్: ఫ్రాన్స్‌లో జరిగిన 47వ ప్రపంచ నైపుణ్యాల పోటీలో రాష్ట్ర యువకులు సత్తాచాటారు. దేవ్‌గఢ్‌కు చెందిన అమరేష్ కుమార్ సాహు, గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన అఖిల్ గేదెల బహుమతులు గెలుచుకున్నారు. వీరిరువురికి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, విపక్ష నేత నవీన్ పట్నాయక్‌లు అభినందనలు తెలిపారు. రెన్యూవబుల్ ఎనర్జీలో అమరేష్ కుమార్ సాహు కాంస్యం గెలుచుకోగా, వాటర్ టెక్నాలజీలో అఖిల్ గేదెల అత్యుత్తమ పతకాన్ని సాధించడం రాష్ట్రానికి గర్వ కారణంగా పేర్కొన్నారు. మన యువత సాధించిన విశేషమైన విజయాలు ప్రేరణగా నిలుస్తాయని సీఎం హర్షం వ్యక్తం చేశారు. నైపుణ్యాలను మెరుగుపరచడంలో గత ప్రభుత్వం ఎంతో చొరవ చూపిందని ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు.

ప్రధానికి సంప్రదాయ స్వాగతం



రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి భువనేశ్వర్ నగరంలో ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయన రాక పురస్కరించుకుని స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆవరణలో సవర సంప్రదాయ నృత్యాలు, గానా బజానాతో ఆహ్వానం పలికారు.

\- భువనేశ్వర్



మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



భువనేశ్వర్: ఐఐటీ ప్రాంగణంలో ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచారం

రాయగడ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వ విద్యాలయం క్యాంపస్‌లో మొక్కలను మంగళవారం నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నవరంగపూర్‌కు చెందిన జాతీయ ఫ్లోరెన్స్ నైట్ యాంగిల్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత సేబతి సాహు హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కల ఆవశ్యకత గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు చంద్రధ్వజ పండ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వర్: ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచార కార్యక్రమం కింద స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ప్రాంగణంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దాదాపు 100 మంది సభ్యులు పాల్గొని క్యాంపస్‌లోని వివిధ ప్రదేశాల్లో సుమారు 200 మొక్కలు నాటారు.



రాయగడ: జీఐఈటీలో మొక్కలు నాటుతున్న దృశ్యం

క్లుప్తంగా

గురజాడ గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురజాడ కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాయలంలో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఏ పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు ఇక్కడ చదువుతున్నదీ వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాల లభ్యత తదితర అంశాల గురించి తెలుసుకుని, గ్రంథాలయ నిర్వహణకు వనరుల లభ్యతపై సంస్థ కార్యదర్శి లక్ష్మిని ఆరా తీశారు.

స్కూల్‌గేమ్స్ ఎంపికలకు ఆధార్ తప్పనిసరి

విజయనగరం: పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులు విధిగా తమ ఆధార్ కార్డును వెంట తీసుకు రావాలని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కృష్ణంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌స్టేడియంలో అండర్ -14,17 వయస్సుల విభాగాల్లో బాల,బాలికలకు ఫుట్‌బాల్ క్రీడాంశంలో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చని, జిల్లా స్థాయి ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేయనున్నామని, ఈ అవకాశాన్ని అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాముకాటుతో యువకుడి మృతి



శ్రీను (ఫైల్)

పాచిపెంట: మండలంలోని గొట్టూరు పంచాయతీ దిగువగొట్టూరులో పాముకాటుకు గురై ఓ గిరిజన యువకుడు మంగళవారం మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సేబి శ్రీను(24) కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారు జామున సుమారు మూడు గంటల సమయంలో పాము ఇంట్లోకి వచ్చి నిద్రిస్తున్న శ్రీను పెద్ద కుమార్తె ఒంటిపైన పాకింది. వెంటనే ఆమె పెద్దగా కేకలు వేయడంతో ఏం చేయాలో అర్థం కాక శ్రీను తన కుడి చేతితో పామును పట్టుకోగా కాటు వేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే కుటుంబసభ్యులు గ్రామస్తుల సహాయంతో గురువునాయుడుపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం సాలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్ సురేష్ తెలిపారు. మృతుడు శ్రీనుకు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

దివ్యాంగులకు రుణ మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ వారి ఆధ్వర్యంలో జిల్లాలోని దివ్యాంగులు ఒక్కొక్కరికి స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకునేందుకు రూ.50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు రుణ మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఎ.డి జగదీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు రుణాలు పొందేందుకు లబ్ధిదారుని వాటా కింద 5 శాతం చెల్లించాల్సిన ఉంటుందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు వైకల్య శాతం 40 శాతం అంతకంటే ఎక్కువ ఉన్న వారు అర్హులని తెలిపారు. వయసు 18 నుంచి 60 సంవత్సరాలు లోబడి ఉండాలని పేర్కొన్నారు. బుద్ధిమాంద్యం కలిగిన వారు 14 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారు అర్హులని తెలిపారు. సదరం ధృవీకరణ పత్రం, యూడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రం, విద్య, శిక్షణ పొందిన ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ మొదటిపేజీ, వికలాంగత్వం తెలిపే రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ప్రాజెక్టు వ్యయం రూ.లక్ష దాటితే జిల్లా పరిశ్రమల శాఖ ఆమోదించిన ప్రాజెక్టు రిపోర్టు, అవసరమైన ప్రాజెక్టులకు కాలుష్య నియంత్రణ మండలి, ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ సమర్పించాలని వివరించారు.

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగులు సీట్లు కోసం నాల్గోవిడత ప్రవేశాలకు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐల జిల్లా కన్వీనర్ టి.వి.గిరి తెలిపారు. 27వ తేదీ సాయంత్రం 3 గంటలలోగా దరఖాస్తు చేసిన ఐటీఐకి ఒరిజినల్ ధ్రువపత్రాలతో వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు 28వ తేదీన, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు 29వ తేదీన ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

రైతుకు కలిసిరాని కాలం



నీరు నిల్వతో కుళ్లిపోయిన బీర పంట

- పంటలను పాడు చేస్తున్న చీడపీడలు
- చేతికందే సమయంలో వర్షాలు
- వేరు కుళ్లు తెగులుతో వాడిపోయి చనిపోతున్న మొక్కలు
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రైతులు

రామభద్రపురం: వర్షాలు సకాలంలో కురవడంతో రైతులు సంతోషించారు. పంటలు పచ్చగా ఉండడంతో సంబరపడ్డారు.ఈ సీజన్ కాసులు పండిస్తుందనే ఆనందంలో ఉండగా కురిసిన అధిక వర్షాలు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో నీరు పొలాల్లో ఎక్కువగా చేరగా తేమ అధికమై పంటలు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆరుగాలం కష్టపడినా కాలం కలిసి రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సీజన్ మొదట్లో విత్తు విత్తనీయకుండా ముఖం చాటేసిన వరుణుడు ప్రస్తుతం పంట చేతికందే సమయంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు కూరగాయ పంటలు నీట మునిగాయి. దీంతో పంటల్లో నీరు నిల్వ ఉండడం వల్ల భూమి ఊట ఎక్కి నీరు ఆరుతున్న కొద్దీ కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి.అలాగే పంటలకు చీడపీడలు, వైరస్‌లు సోకడంతో రైతు పూర్తిగా నష్టాలబారిన పడ్డాడు. ఈ ఏడాది కాలం ఎలా వెళ్లదీయాలా? అని కూరగాయ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందివ్వకపోవడం, అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పండించిన



పొట్టి చిక్కుడు పంటలో నిల్వ ఉన్న వర్షపు నీరు

పంటలు వర్షాలకు పాడైపోవడంతో తీవ్రనష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు.

300 హెక్టార్లలో వివిధ పంటల సాగు

జిల్లాలో ఏటా తీవ్ర వర్షాభావం నెలకొంటుండడంతో రైతులు వరి సాగు ఆశలు వదులుకుని ఆరుతడి పంటలైన కూరగాయల సాగుపై దృష్టి సారించారు. అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 300 హెక్టార్లలో బీర, పాదవుచిక్కుడు, బెండ, వంగ, కాలిఫ్లవర్,



అధిక వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న ఆనప పంటను చూపుతున్న రైతు వెంకటరావు

ఆనప, క్యాబేజీ, టమాటో, తోటకూర తదితర పంటలు సాగు చేశారు.

అధిక వర్షాలతో నష్టం



అధిక వర్షాల కారణంగా కూరగాయ పంటలు కొద్దో గొప్పో దెబ్బతినే ప్రమాదం ఉంది.కూరగాయ పంటలు ఆరుతడి పంటలే తప్ప అధిక వర్షాలు వాటికి పనికి రావు. అలాగే వర్షం వల్ల పూత పిందె రాలడం సర్వసాధారణం. తుఫాన్ ప్రభావంతో పాడైన కూరగాయ పంటలను పరిశీలిస్తున్నాం. సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మరీ దెబ్బతిన్న పంటలను అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

– పి.మోహనకృష్ణ, మండల ఉద్యానశాఖాధికారి

ప్రభుత్వమే ఆదుకోవాలి



తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షం కూరగాయల రైతును నిండా ముంచింది. విత్తనం వేసిన తర్వాత వర్షం పడక కొంత వరకు నష్టపోయాం. పంటను ఎలాగోలా కష్టపడి బతికించుకున్నామంటే తుఫాన్ ప్రభావంతో పూర్తిగా దెబ్బతిన్నాం .కొద్దో గొప్పో పంటలు ఉన్నాయంటే వాటికి చీడపీడలు, వైరస్ సోకడంతో పంటలు పాడై దిగుబడులు తగ్గుతున్నాయి.మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తున్నాయంటే కూరగాయలు లేవు. నీరు నిల్వ ఉండి భూమి ఊటబారడం వల్ల నీరు ఆరుతున్న కొద్దీ మొక్కలు చనిపోతున్నాయి. దీంతో వేలాది రూపాయల పెట్టుబడులు నష్టపోతున్నాం. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– పూడి వెంకటరావు, రైతు, రామభద్రపురం

అధికారుల పర్యవేక్షణ కరువు

గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో తక్కువ ధరలకు నాణ్యమైన విత్తనాలతో పాటు పురుగు మందులు లభించేవి. అలాగే ఆయా కేంద్రాలలో సచివాలయం వీఏఏ, వీహెచ్‌ఏలతో పాటు మండల స్థాయి వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంటలను నిత్యం పర్యవేక్షిస్తూ రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించేవారు. ఇప్పుడా పరిస్థితి లోపించింది. ఈ ప్రభుత్వం ఆర్బీకేలను రైతు సేవాకేంద్రాలుగా మార్చిందని, వాటిలో సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందించడం లేదని రైతులు చెబుతున్నారు.అలాగే రైతు సేవా కేంద్రాలలో పనిచేస్తున్న వ్యవసాయాధికారులు కూడా తుఫాన్ ముందస్తు పర్యవేక్షణ చేయకపోవడం , తుఫాన్ తర్వాత కూడా పంటలను పరిశీలించి పంటల సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు సలహాలు ఇవ్వడం లేదని చెబుతున్నారు. అలాగే పురుగు మందులు కూడా దొరకడం లేదని ఆరోపిస్తున్నారు. ఆరుగాలం కష్టపడినా అన్నదాతకు కాలం కలిసి రావడం లేదు సరికదా ప్రభుత్వం నుంచి సహకారం లేక భారీగా నష్టాల బారిన పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ

భామిని: నీతిఆయోగ్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఆశావహ బ్లాక్‌ల పథకం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు అభివృద్ధి పరిచేందుకు చేపట్టిన పథకాల అమలులో దక్షిణ భారతదేశంలోనే భామిని మండలం అగ్రభాగంలో నిలిచిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రశంసించారు. ఈ మేరకు మంగళవారం భామిని మండల కేంద్రంలో 75వ సామాజిక్ అధికారితా శివిర్స్ ప్రోగ్రాంలో దివ్యాంగులకు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో కలిసి ఆధునిక పరికరాల పంపిణీని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఏస్పిరేషన్ ప్రోగ్రాంలో 6 పారామీటర్ల సర్వేలో భామిని అగ్రభాగాన నిలిచిందని హర్షధ్వానాల మధ్య తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో ఆశావహం నుంచి ఆదర్శంగా మారాలని పిలుపునిచ్చారు. భామినిని ఏపీలో చివర మండలం కాదు, ఒడిశా నుంచి మొదటి మండలంగా భావించాలన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం కింద పరిసరాల పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ చిన్న మండలంలో



దివ్యాంగులకు ఆధునిక పరికరాలు అందిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే జయకృష్ణ

నీటి పథకాలు మరుగున పడి రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. జిల్లాల విభజనలో బురుజోలకు చెందిన 44 మంది రైతుల భూ పరిహారాలు అందలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి, ఆయుర్వేద వైద్యుడు శ్రీరాములు, ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహచలం, లోపింటి రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు రవినాయుడు, ఎం.జగదీశ్వర రావు,ఎంపీడీఓ చంద్రరావు, తహసీల్దార్ నిమ్మల శేఖరం, వైద్యాధికారులు దీపికారాణి, పి. సోయల్, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఇద్దరి దుర్మరణం

- లారీని కారు ఢీకొనడంతో ప్రమాదం



నమ్మి మనోజ్‌కుమార్, అలమండ శ్యామ్‌ప్రసాద్ మృతదేహాలు



ప్రమాద స్థలిలో కారు, లారీ

డెంకాడ: మండలంలోని మోదవలస వద్ద విశాఖ-విజయనగరం జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ వైపు నుంచి విజయనగరం వైపు వస్తున్న కారు మోదవలస వద్ద రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నమ్మి మనోజ్‌కుమార్(30), అలమండ శ్యామ్‌ప్రసాద్ (31)లు తీవ్రగాయాలతో కారులో ఇరుక్కుపోయి మరణించారు. మరణించిన నమ్మి మనోజ్‌కుమార్ విజయనగరంలోని ఇప్పిలి వీధికి చెందిన వ్యక్తి. ఏడాది క్రితమే ఆయనకు వివాహమైంది. అలాగే మరణించిన మరోవ్యక్తి అలమండ శ్యాంప్రసాద్ విశాఖ జిల్లా భీమునిపట్నం మండలంలోని ఆర్.తాళ్లవలస గ్రామానికి చెందిన వ్యక్తి. మృతులిద్దరూ బంధువులే. వారిద్దరూ తిరుపతి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు.

రోడ్డుపై నిర్లక్ష్యంగా ఆపిన లారీ

ఎలాంటి సిగ్నల్స్ వేయకుండా నిర్లక్ష్యంగా లారీని జాతీయ రహదారిపై నిలిపి తన కుమారుడు కారు ప్రమాదానికి కారణమైన లారీపై పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మృతుడు నమ్మి మనోజ్‌కుమార్ తండ్రి నమ్మి భాస్కరరావు డెంకాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రదానం అభినందనీయం

చనిపోయిన వ్యక్తుల నేత్రాలు దానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఇటీవల తిరుపతిలో వేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని కారులో తిరిగి వస్తున్న స్నేహితులు అలమండ శ్యామ్‌ప్రసాద్, నమ్మి మనోజ్‌కుమార్‌లు మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మార్చురీకి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కొండ వెలగాడ ఆప్తాలిమిక్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరావు, సర్వజన ఆస్పత్రి డాక్టర్ జశ్వంత్ (పీజీ) చనిపోయిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు నేత్రదానం గురించి అవగాహన కల్పించి ఒప్పించారు. ఈ మేరకు రెడ్ క్రాస్ సొసైటీ ఐ డొనేషన్ సెంటర్ అప్తాలమిక్ టెక్నీషియన్ రమణ సర్వజన ఆస్పత్రి మార్చురీకి వచ్చి చనిపోయిన వ్యక్తుల నుంచి నేత్రాలను సేకరించారు.నేత్ర దానానికి అంగీకరించిన శ్యామ్‌ప్రసాద్, మనోజ్‌కుమార్ కుటుంబ సభ్యులను డీఎంహెచ్‌ఓ అభినందించారు. కార్యక్రమంలో అప్తాలమిక్ అధికారి బాలాజీ ప్రాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.



నేత్రాలను సేకరిస్తున్న వైద్యుడు జశ్వంత్, టెక్నీషియన్ రమణ

డోలీలో మృతదేహం తరలింపు

- గిరిజనులకు తప్పని కష్టాలు



డోలీలో మృతదేహాన్ని తీసుకుని వెళ్తున్న గిరిజనులు

గంట్యాడ: రహదారి సౌకర్యం లేక..డోలీ కష్టాలు తీరక గిరిజనులు నరక యాతన అనుభవిస్తున్నారు. ఏదైనా జబ్బు చేస్తే ఆస్పత్రికి తీసుకువెళ్లాలన్నా, ఆస్పత్రుల్లో ఎవరైనా చనిపోతే వారిని గ్రామానికి తరలించాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కూడా అటువంటి హృదయ విదారక ఘటన జరిగింది. గంట్యాడ మండలంలోని గిరిశిఖర గ్రామమైన దిగువ కొండపర్తికి చెందిన గిరిజనుడు గద్దల రాజారావుకు పచ్చకామెర్లు రావడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కొద్ది రోజుల క్రితం చికిత్స కోసం చేరాడు. సోమవారం రాత్రి ఆస్పత్రిలో మృతిచెందాడు. మంగళవారం ఉదయం అంబులెన్సులో స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకుని బయలు దేరారు. అనంతగిరి మండలం చిలకల గెడ్డ వరకు మృతదేహాన్ని అంబులెన్సులో తీసుకుని వెళ్లారు. అక్కడి నుంచి గ్రామానికి వెళ్లడానికి రహదారి లేకపోవడంతో గిరిజనులు డోలీకట్టి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న దిగువ కొండపర్తికి రాజారావు మృతదేహాన్ని అతికష్టం మీద తీసుకుని వెళ్లారు.

రేపటినుంచి ఉచిత ఇసుక పోర్టల్ ప్రారంభం

పార్వతీపురం: ఉచిత ఇసుక సరఫరా కోసం పోర్టల్‌ను ఈనెల 19నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక పోర్టల్ ప్రారంభించేందుకు అవసరమైన విధి విధానాలన్నింటినీ ముందుగా పూర్తిచేసుకుని సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఇసుక తవ్వకాలు, రవాణా ఖర్చులకు మాత్రమే డబ్బులు వసూలు చేయనున్నట్లు తెలిపారు.

చెరువులో వ్యక్తి గల్లంతు

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని సారిక గ్రామంలో ఉన్న చెరువులో ఈతకు వెళ్లిన ఐదుగురు వ్యక్తుల్లో ఒకరు గల్లంతైనట్లు రూరల్ పోలీసులు మంగళవారం తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలో సారిక గ్రామాన్ని ఆనుకుని స్కూల్ పక్కన చింతలగుండం చెరువులో గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మంగళవారం ఈతకు దిగారు. తిరిగి నలుగురు మాత్రమే ఒడ్డుకు వచ్చారు. గ్రామానికి చెందిన తోట సూరిబాబు(45) తిరిగి రాకపోవడంతో మిగిలిన నలుగురు మళ్లీ వెతికినా కనపడకపోయేసరికి గ్రామపెద్దలు, రూరల్ పోలీసులకు సమాచార మందించారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై వి.అశోక్ కుమార్ సంఘటనా స్థలానికి సిబ్బందితో కలిసి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. గల్లంతైన సూరిబాబుకు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. .

పండగ నిర్ణయం ధర్మకర్తలదే



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పాల్గొన్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు

- నిర్వహణ బాధ్యత స్థానిక మంత్రిదే
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పండగలైనా, పార్టీలైనా ప్రజానిర్ణయంపైనే ఆధారపడతాయని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరు పట్టణంలోని తన గృహంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణ దేవత శ్యామలాంబ పండగకు సంబంధించి నిర్ణయించే బాధ్యత ఆలయధర్మకర్తలు, పట్టణ పెద్దలదని, ఆ పండగ నిర్వహణ ప్రజాప్రతినిధులదని చెప్పారు. పండగలైనా, పార్టీలైనా ప్రజానిర్ణయంపైనే ఆధారపడతాయని పునరుద్ఘాటించారు.

టీడీపీ తలుపు తాళం తీస్తే పలువురు ఆ పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని ఇటీవల టీడీపీ నాయకులు మాట్లాడిన మాటలపై ఆయన స్పందించారు. స్వార్థపరులే వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీ కూటమి పార్టీల్లోకి వెళ్లిపోతారన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవచేయాలనుకున్న వారు వైఎస్సార్‌సీపీలోనే ఉంటారని స్పష్టం చేశారు. నేటి టీడీపీ కూటమి పాలనలో నియోజకవర్గంలో చిరుద్యోగుల తొలగింపు, ఉద్యోగులను బదిలీలపై వెళ్లిపోవాలని ఆ పార్టీ నాయకులు బెదిరింపులు దారుణమన్నారు. ఓ గిరిజన ఎంపీటీసీని కులంపేరుతో దూషిస్తూ జుట్టు పట్టుకుని ఈడ్చి టీడీపీ నాయకులు కొట్టడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రజా ప్రతినిధులు, నాయకులు గిరిరఘు, అప్పారావు, రామకృష్ణ, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుక



విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలో విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ మేరకు స్థానిక బొండాడ వీధిలో వేంచేసి ఉన్న కామాక్షి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పట్టణ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంక్షేమ భవనంలో విశ్వకర్మ జయంతి వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా పుణ్యాహవచనం, నవగ్రహారాధన, వాస్తు ఇత్యాది పూజాక్రతువులను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ప్రతినిధి, డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాస రావు మాట్లాడుతూ సృష్టికి పూర్వమే విశ్వకర్మ నిర్గుణాకారంలో ఉద్భవించారన్నారు. పంచభూతాలు ఏర్పడక ముందే విశ్వకర్మ ఉద్భవించారని శ్రీకష్ణుడికి ద్వారకను, ధర్మరాజుకు ఇంద్ర ప్రస్థను, శివుడికి స్వర్ణలంకను నిర్మించిన విశ్వకర్మ ప్రసిద్ధి చెందారని గుర్తు చేశారు. అందువల్లనే అన్ని పరిశ్రమలలో విశ్వకర్మ పూజలు నిరాటంకంగా సాగుతున్నాయని చెప్పారు. చేతివత్తుల వారికి ఆది దేవుడిగా విశ్వకర్మ పూజలు అందుకుంటున్నారన్నారు. భారత ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. తద్వారా కొంతమందికి లబ్ధి చేకూరుతుందన్నారు. విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ప్రతినిధులు లక్కోజు శేఖర్, సోమరాజు మాట్లాడుతూ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం మూడు రోజులపాటు జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం విశ్వకర్మ అనుపోత్సవం చేపట్టనున్నామని చెప్పారు. కావున ప్రతి ఒక్కరూ జయంతి ఉత్సవాలలో పాల్గొని విశ్వకర్మ అనుగ్రహానికి పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వరాహాచారి, అప్పలరాజు, వేల్పూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రంపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ శోభిక తదితరులు

పార్వతీపురంలో..

పార్వతీపురం: విశ్వకర్మ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మద్విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచ తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా పేరుగాంచిన విశ్వకర్మను స్మరించుకుని పూజించుకోవడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవనాయుడు, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎం.సావిత్రి, సూపరింటెండెంట్ శ్రీరామ్మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆ వీడియో దైవసన్నిధిలోనిది కాదు

- మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న సంధ్యారాణి

సాలూరు రూరల్: సోషల్ మీడియాలో మంత్రి సంధ్యారాణి భర్త, ఆమె అనుచరులు తిరుపతి కొండపైన ఉండే అతిథిగృహంలో డ్యాన్సులు చేసినట్టు సాగుతున్న ప్రసారంలో వాస్తవం లేదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. విజయవాడలో గతనెల 29న తన కుమారుడు పుట్టినరోజు వేడుకల్లో చేసిన నృత్యప్రదర్శనగా పేర్కొన్నారు. దైవసన్నిధిలో తప్పుగా ప్రవర్తించే అలవాటు తనకు, కుటుంబ సభ్యులకు లేదన్నారు. పుట్టినరోజు వేడుకలు ముగిసిన మరుచటిరోజు తిరుమలకు కాలినడకన చేరుకున్నామన్నారు. స్వామివారి దర్శనం అనంతరం విజయవాడ వచ్చేశామని, అసలు పద్మావతి వసతి గృహానికి వెళ్లలేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు విజయవాడ వరద బాధితులకు సేవలు అందిస్తున్న విషయాన్ని తెలుసుకొని అక్కడకు చేరుకున్నానన్నారు. సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రసారం నిజంకాదన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమశాఖ పనితీరు మెరుగుపడాలి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ పనితీరు మరింత మెరుగుపడాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, అనుబంధ విభాగాల పనితీరుపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది పనితీరు మెరుగుపడాలని, నిర్లిప్తతను విడనాడాలని సూచించారు. ప్రగతి తక్కువగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విభాగం మరింత చైతన్యం కావాల్సి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం 4.87 శాతంగా ఉన్న అతితీవ్ర పోషకాహార లోపాన్ని రెండు నెలల్లో సున్నాకు తీసుకురావాలని ఆదేశించారు. యాచక వృత్తిలో ఉన్న 19 మంది బాలలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించామని ఆ శాఖ సిబ్బంది చెప్పగా, వారి పరిస్థితిపై తనకు రెండు రోజుల్లో నివేదికను సమర్పించాలని కోరారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు ఇందు ఎంపిక

విజయనగరం/చీపురుపల్లి: జాతీయస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ టెన్నికాయిట్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఇందు అర్హత సాధించింది. ఈ నెల 13,14 ,15 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో జిల్లాలోని పెద్ద నడిపల్లి హైస్కూల్ విద్యార్థిని ఒ.ఇందు పాల్గొని ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆమె ఈనెల 29 నుంచి జమ్ము కశ్మీర్‌లో జరగనున్న జాతీయ పోటీలలో పాల్గొననుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు జాతీయ పోటీలకు ఎంపికైన ఆమెను జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.గోపాల్‌లు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రతిభ కనబరిచి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని ప్రోత్సహించారు.



జమ్మూ కాశ్మీర్‌లో జరగబోయే టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన ఇందు